www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 16 జనవరి 2025
చిత్తూరు



పండుగ రోజూ పట్టువదలక...

ప్రజాశక్తి - కుప్పం రూరల్

ఈ రాతి పరిశ్రమ వల్ల మా ఆస్తులు ధ్వంసం కావడమే కాదు.. మా ఆరోగ్యాలు చిన్నాభిన్నం అవుతున్నాయి.. ఈ పరిశ్రమను ఇక్కడినుంచి తొలగించే వరకూ మా పోరాటం ఆగదు' అంటూ రైతులు చేస్తున్న ఆందోళన బుధవారం పదోరోజూ కొనసాగింది. పండుగ రోజూ పట్టువదలక నిరసన కొనసాగింది. పది రోజులుగా నిరంతరాయంగా ఆందోళన చేస్తున్నా ఏ ప్రభుత్వ అధికారి స్పందించడం లేదని రైతులు



వాపోయారు. తమ గ్రామాల పరిధిలో నిర్వహిస్తున్న రాతి పరిశ్రమ వల్ల కాలుష్యంతో పాటు, తమ ఆరోగ్యాలు పాడవుతున్నాయన్నారు. శ్వాసకోశ వ్యాధులతో చికిత్సలు చేయించుకోలేక, శ్వాస పీల్చుకోలేక తమ బాధ వర్ణనాతీతమన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకొన్నారు. పది రోజులుగా కాలుష్య కోరల్లో చిక్కుకున్నామని కుప్పంలో అన్నదాతలు ఆందోళన చేస్తుంటే, పట్టించుకోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఈ వారం రోజుల్లోనే కుప్పంలోనూ, నారావారిపల్లిలోనూ తన పర్యటనను సాగించారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో 'పర్యావరణ హితమే తన లక్ష్యం' అని చెప్పడం కొసమెరుపు.



నారావారిపల్లిలో చంద్రబాబు కుటుంబ సభ్యుల సందడి

ఊరంతా 'సంక్రాంతి'

వచ్చాం...సందడి చేశాం..వెళ్లొస్తాం..!

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

సంక్రాంతి వేడుక మూడు రోజుల పాటు పల్లెల్లో చూడముచ్చటగా జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా నారావారిపల్లిలోనే మూడు రోజుల పాటు సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో మనవడు దేవాన్ష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పర్యావరణ హితమే తన లక్ష్యమని, స్వర్ణాంధ్ర విజన్ 2047 రూపకల్పన విశేషాలను మీడియాతో ముఖ్యమంత్రి పంచుకున్నారు. ఇక కనుమ రోజు రంగంపేటలో ఎద్దులు రంకె వేశాయి. జల్లికట్టు యువతలో ఉత్సాహాన్ని నింపింది. చంద్రబాబు మంగళవారం సాయంత్రం బయల్దేరి వెళ్లగా, మంత్రి నారా లోకేష్ బుధవారం అమరావతికి వెళ్లారు. పెద్దల పండుగ రోజు మంగళవారం తల్లిదండ్రులు అమ్మణ్ణమ్మ, ఖర్జూరనాయుడు సమాధుల వద్ద చంద్రబాబు దంపతులు కుటుంబ సమేతంగా పుష్పాంజలి ఘటించారు. నాగాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిఎం స్వగృహం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు, బసవతారకం దంపతుల విగ్రహాలను ఆవిష్కరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఎమ్మెల్యేలు పులివర్తి వెంకట మణి ప్రసాద్, డాక్టర్ కె మురళీమోహన్, సినీ నటుడు నారా రోహిత్, నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి,రామకృష్ణ,పులివర్తి వినీల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్, యంత్రాంగం

ఊరంతా సంక్రాంతి వేడుకలు ఉవ్వెత్తున జరిగాయి. గాలిపటాలు ఎగురవేయడం, ముగ్గులు వేయడం, క్రికెట్ ఆడటం, జల్లికట్టు నిర్వహించే కార్యక్రమాలతో ప్రజలు సంప్రదాయబద్ధంగా సంక్రాంతిని జరుపుకున్నారు.

ఎంఎల్ఎ గురజాల ఇంట.. : చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్వగహంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగను ఉత్సాహంగా జరుపుకొన్నారు. పండుగ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటి లోగిళ్ళన్నీ రంగురంగుల రంగవల్లులతో నిండిపోయాయి. గాలిపటాలు, పుష్పాలంకరణలు, పచ్చ తోరణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం ఉదయమే ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా భోగి మంటలను వేశారు. భోగి చుట్టూ భోగి పాటలు పాడుతూ పండుగను ఆస్వాదించారు. అనంతరం సంక్రాంతి సంబరాలను గుర్తు చేస్తూ గంగిరెద్దుకు ధాన్యం తినిపించారు. సరదాగా కోళ్లను బరిలోకి దింపారు. ఈ సందర్భంగా మహిళలు గొబ్బియాలో.. గొబ్బియాల్లో.. అంటూ సంక్రాంతి పాటలు పాడుతూ నత్యం చేశారు. కొత్త కుండలో పొంగళ్లు పెట్టి దేవుడికి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు, రైతులు, యువత, మహిళలు సంక్రాంతి పండగను సంతోషంగా జరుపుకోవాలని.. అందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవనం సాగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. కొత్త సంవత్సరంలో నియోజకవర్గంలో మరింత అభివద్ధి కార్యక్రమాలు జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.

నగరి (విజయపురంలో)... పండుగను పురస్కరించుకొని పట్టణంలోని వీధులు రంగవల్లికలతో ముస్తాబయ్యాయి. రాత్రిపూట పండగ ముగ్గులు వేయడంలో మహిళలు ఉత్సాహం చూపారు. పెద్దలు, పిల్లలు కొత్త దుస్తులతో కోలాహలంగా కనిపించారు. మహిళలు కొత్త కుండల్లో పొంగళ్లు పెట్టి సూర్యునికి నైవేద్యం పెట్టి సంక్రాంతిని జరుపుకున్నారు. బుధవారం పశువుల పండుగను వైభవంగా నిర్వహించుకున్నారు. పశువులను శుభ్రపరచి వాటిని అలంకరించారు. కొత్త గంటలు కట్టి వాటి కొమ్ములకు రంగులు వేశారు. యువకులు వీధుల్లో ఉట్టికట్టి వాటిని కొడుతూ సంబరాలు చేసుకున్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నారు. విజయపురం, కోసలనగరం, జంబాడలో పిల్లలకు మ్యూజికల్ డ్యాన్స్, పాటల పోటీలు నిర్వహించారు. మండలంలోని నారపరాజు కం డ్రిగలో మాజీ నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శోభారామకష్ణమరాజు క్రికెట్ టోర్నమెంటు నిర్వహించి విజేత గా నిలిచిన మల్లారెడ్డి కండ్రిగ టీంకు నగదు బహుమతి రూ. 5 వేలు, రన్నర్గా నిలిచిన టీంకు నగదు బహుమతి రూ. 3 వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జ్యోతిప్రకాష్, ప్రవీణ్‌కుమార్, త్రినాథ్, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వెలుగులు నింపాలి : ఆర్‌కె రోజా

సంక్రాంతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, కనుమ



ఎంఎల్ఎ గురజాల ఇంట...

కమ్మనైన అనుభూతులు నింపాలి అని మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆర్కే రోజా అన్నారు. మంగళవారం సంక్రాంతి పండుగను, బుధవారం కనుమ పండుగను ఆమె నగరి పట్టణంలోని తన స్వగహంలో కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి వైభవంగా నిర్వహించుకున్నారు. సంక్రాంతి పర్వదినాన సింగిరి కోన లక్ష్మీనరసింహస్వామిని, తిరుత్తణి సుబ్రమణ్యస్వామిని కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి దర్శించుకున్నారు. ఇంటి వద్ద ప్రత్యేక పూజలు చేసి సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సాంప్రదాయాలకు నెలవన్నారు.

కుప్పంలో సాంప్రదాయ పోటీలు

కుప్పం టౌన్‌లో.. : కుప్పం పట్టణం కొత్తపేటలో సంక్రాంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా కొత్తపేట టిడిపి ఇన్చార్జ్ ముఖేష్ ఆధ్వర్యంలో హిందూ సాంప్రదాయం ఉట్టిపడేలా మహిళలకు రంగవల్లి పోటీలు, చిన్నారులకు సైకిల్ పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్, ప్రోగ్రెస్ వంటి పోటీలు, యువతకు ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిమను కనబరిచిన వారికి బహుమానాలను అందజేసి ప్రోత్సహించారు. అనంతరం కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన జల్లికట్టు స్థానికులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు సుకుమార్, మునియప్ప, మురళి, ఉదయ్ కుమార్, వాసు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లిలో... కడపనత్తం గ్రామంలో వెలసిన నల్లగంగమ్మకు అర్చకులు పంచామృత అభిషేక పూజలు విశేషంగా నిర్వహించారు. అనంతరం నల్ల గంగమ్మ గెరిగెను వివిధ పుష్పాలతో అలంకరించి మేళతాళా, డప్పు వాయిద్యాలతో, వివిధ సాంస్కతిక కార్యక్రమాలతో పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు.

దళితుల సమస్యలు పట్టవా..!

ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ సమావేశాలకు మంగళం
ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్
పూతలపట్టు 'రిజర్వుడ్'లో ఇదీ పరిస్థితి

ప్రజాశక్తి -యదమరి

ఎంతోమంది మేధావులు, ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా దళితుల సమస్యల పరిష్కారం కోసం జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పాటయింది. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం కమిషన్ ఆదేశాలను చట్టంగా మార్చాయి . దళితుల సమస్యల పరిష్కారంలో జిల్లా మండల స్థాయి అధికారులు మూడు నెలలకు ఒకసారి సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే నియోజకవర్గంలో దళితుల సమస్యలు కుప్పలు తెప్పలుగా ఉన్నా, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా రిజర్వుడ్ నియోజకవర్గంలోనే మానిటరింగ్ సమావేశాలు నిర్వహించకపోవడంపై సర్వత్రా దళిత సంఘాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి తప్ప, పూతలపట్టు నియోజకవర్గంలో మాత్రం ఈ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశాలను మండల స్థాయి అధికారులు గాలికి వదిలేశారు. పూతలపట్టు నియోజకవర్గం లోని, బంగారుపాళ్యం ,తవణంపల్లి, ఐరాల, పూతలపట్టు, యాదమరి మండలాల్లో అధిక సంఖ్యలో దళితుల భూ సమస్యలతో తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అలాగే దళిత సంక్షేమ , అభివద్ధి పథకాలు, భూ సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలు అమలు అన్ని రకాల సంబంధించిన అంశాల పైన ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సి ఉంటుంది.


మండల కమిటీలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చైర్మన్గా మండల తాసిల్దార్ కన్వీనర్ గా వ్యవహరిస్తారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, జడ్పిటిసి, ఎస్సీ ఎస్టీ ,సర్పంచులు ,వివిధ దళిత కుల సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సభ్యులుగా వ్యవహరిస్తారు. వీరి ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్ అవుతూ, దళితుల సమస్యలు అపరిష్కృతంగానే ఉండటం గమనార్హం.

ప్రతి మూడు నెలలకూ నిర్వహించాలి :
ఈశ్వర్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి

ప్రతి మూడు నెలలకు ఒకసారి దళితుల సమస్యలపై విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు ప్రతి తాసిల్దార్ కార్యాలయంలో నిర్వహించాలి. గత ప్రభుత్వంలో విజిలెన్స్ కమిటీ సమావేశాలు నిర్వహించడంలో విఫలమైంది. పూతలపట్టు నియోజకవర్గం లోని ఐదు మండలాల్లో విజిలెన్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి. నియోజకవర్గ ఎమ్మెల్యే మురళీమోహన్, జిల్లాస్థాయి అధికారులు ఇప్పటికైనా మండల పరిధిలోని అన్ని శాఖల అధికారుల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.

జీతాలిక్కడ... పని అక్కడ...!

ఉపాధి కార్యాలయంలో వెట్టి చాకిరి
ఇద్దరి పని ఒక్కరితోనే...
పట్టించుకోని ఉన్నతాధికారులు



వెక్కిరిస్తున్న ఖాళీ కుర్చీలు

ప్రజాశక్తి - యాదమరి

మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో ఇద్దరు ముగ్గురు చేసే పనిని ఒకరి ద్వారానే చేయిస్తూ 'వెట్టి'కి కేరాఫ్‌గా పనిచేయిస్తున్నారు సంబంధిత అధికారులు... చిత్తూరు రూరల్ ఉపాధి హామీ క్లస్టర్ పరిధిలో ఆరు మండలాలున్నాయి. అందులో యదమరి, గుడిపాల, తవణంపల్లి ,జీడి నెల్లూరు, పాలసముద్రం, చిత్తూరు మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో ఇద్దరు సీఓలు, ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నారు. యదమరి మండలంలో మాత్రం మండలానికి అంత ఒకే టెక్నికల్ అసిస్టెంట్, ఒకే కంప్యూటర్ ఆపరేటర్. ఇద్దరు ఉండాల్సిన చోట ఒకరితోనే పని చేయిస్తూ నెట్టుకొస్తున్నారు. వారికి సెలవు కావాలన్నా, ఆరోగ్య ఇబ్బందులు తలెత్తిన, వేరే ఇతర వ్యక్తిగత సమస్యలు వచ్చిన, సెలవు మాత్రం ఇవ్వరు.. సెలవు ఒకవేళ ఇచ్చిన ఏదైనా అవసరం అయిన ఫైల్స్ రికార్డ్స్ కావలసి వస్తే వారు కార్యాలయానికి వచ్చి వెళ్లాల్సింది. ప్రత్యామ్నాయంగా వేరే వారు లేకపోవడంతో అన్ని వారే చూడాల్సి వస్తుంది.

మండలంలోని 26పంచాయితీలు 194 హాబిటేషన్లో సంబంధించి టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లుగా ఒకరే మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ గతంలో పనిచేసిన టెక్నికల్ అసిస్టెంట్స్ ను, కంప్యూటర్ ఆపరేటర్లను డైవర్షన్ ఆర్డర్స్ కింద వేరే మండలాలకు బదిలీ చేశారు. ఒకరిని ఏపీ డి టి ఏ గా, మరొకరిని తవణంపల్లి మండలానికి టెక్నికల్ అసిస్టెంట్ గా బదిలీ చేశారు. ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లను బంగారు పాల్యం మండలం ఒకరు, చిత్తూరు మండలంకు డైవర్షన్ ఆర్డర్ కింద బదిలీ చేశారు. బదిలీ చేసిన గాని వారి ముగ్గురకు జీతం మాత్రం యదమరి మండలం నుండే చెల్లిస్తున్నారు. జీతాలు ఈ మండలంలోనే చెల్లిస్తుండడంతో మండలానికి కొత్తవారిని పరిపాలన సౌలభ్యం కోసం నియమించుకునేందుకు వీలు కలగడం లేదు. యదమరి మండలంలో విధులు నిర్వహించని ముగ్గురికి మండలం అడ్మిన్ కాస్ట్ నుండి జీతాలు చెల్లిస్తుండటం గమనార్హం.

నిత్యం పనుల ఒత్తిడి

నూతనంగా వచ్చిన ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో గోకులం షెడ్లు, ఉపాధి హామీ పథకం కింద సిమెంట్ రోడ్లు, 25బి26సంవత్సరానికి ఉపాధి ప్రణాళికలు, ఎస్టిమేషన్స్, ఎం బుక్ రికార్డ్స్, పనుల తనిఖీలు కొలతలు, ఇలాంటి పనులన్నీ మండల మొత్తం ఒక టీఏతో సాధ్యమవుతుందా.. అలాగే మండలంలోని 26 పంచాయతీల్లో పే ఆర్డర్స్, వర్క్ ఫైల్స్ ,ఎస్టిమేషన్స్ , వర్క్ ఫైల్స్, మాస్టర్ జనరేట్ చేయడం, పై స్థాయి అధికారులు కావలసిన రిపోర్ట్స్, అన్ని మండలంలో ఒక కంప్యూటర్ ఆపరేటర్ చేయాల్సి ఉంది. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి మండలానికి టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ ను ఏర్పాటు చేసినట్లయితే ఉపాధి పనులు ముందుకు సాగే అవకాశం ఉన్నది.

కార్యాలయం నిర్వహణ కష్టమే...?

మండలంలోని ఉపాధి పథకంలో అడ్మినిక్ కాస్ట్ లో జీతాలు, ఆఫీస్ ఫైల్ మెయింటెనెన్స్, స్టేషనరీ, ప్రింటింగ్, ఎలక్ట్రిసిటీ, వాటర్ ఆడిటింగ్, గౌరవ వేతనం, కార్యాలయం నిర్వహణ ఖర్చులు అడ్మిన్ కాస్ట్ లో నుండే ఖర్చు పెట్టాల్సి ఉంది. ఆరు శాతం మించకూడదు. అయితే యాద మరి మండల అడ్మిన్ కాస్ట్ ద్వారా వేరే మండలంలో విధులు నిర్వహించే ముగ్గురికి జీతాలు ఈ మండలం నుండి ఇస్తుండడంతో కార్యాలయ నిర్వహణ నిధుల కొరతతో కష్టంగా మారుతుంది. వేరేచోట విధి నిర్వహణ సిబ్బందికి ఆ మండలాల్లోని జీతాలు చెల్లించకుండా యదమరి లో చెల్లించేందువల్ల ఆఫీసు నిర్వహణ ఇబ్బందులు కు నిధుల కొరత ఏర్పడే అవకాశం ఉంది.అధికారులు స్పందించి డైవర్షన్ ఆర్డర్స్ కింద పని చేసే వారికి ఆ మండల పరిధిలో జీతాలు పొందే విధంగా అధికారులు చూడాల్సి ఉంది. అయితే అధికారులు మాత్రం సిబ్బంది కొరత ఉపాధి హామీని వెంటాడుతున్నా మండల అభివృద్ధి అధికారి గానీ, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గానీ తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.



ఆవులపల్లెలో ఘనంగా పశువుల పండుగ

ప్రజాశక్తి - సోమల

మండలంలోని ఆవుల పల్లె గ్రామంలో పశువుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుండి స్థానిక శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పశువుల పందేలను, జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తల కొమ్ములకు అలంకరణ చేసి బరిలోకి దింపారు. యువకులు ఉత్సాహంగా కోడెగిత్తలను పట్టుకునేందుకు ఉరకలేశారు. పలువురికి కోడిగిత్తలను పట్టుకునే సందర్భంలో స్వల్ప గాయాలు కాగా జల్లికట్టు ప్రశాంతంగా నిర్వహించారు. బుధవారం కనుమ పండుగ సందర్భంగా గ్రామంలో చిట్లకుప్పను వెలిగించి పశువు సంపదను చిట్లకుప్ప చుట్టూ తిప్పారు. కార్యక్రమంలో పెద్ద ఉప్పరపల్లి, అన్నెమ్మ గారి పల్లి, పేటూరు, ఆవులపల్లి, నంజంపేట పంచాయతీల నుండి అధిక సంఖ్యలో జల్లికట్టు తిలకించేందుకు హాజరయ్యారు.

బంగారుపాళ్యంలో... తూంపాయనపల్లిలో పరుష పందేలు జరిగాయి. తిలకించేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. గెలుపొందిన ఎద్దులకు బహుమతులను ప్రదానం చేశారు.



రంగులతో కళను సంతరించుకున్న బసవన్న

మండల కేంద్రమైన సోమల లోని తూర్పు మొగసాలలో గంగ రాతిపై ఎన్నో తరాల క్రితం ఏర్పాటు చేసిన బసవన్న విగ్రహం రంగులు లేక కళావిహీనంగా ఉండడంతో 'ప్రజాశక్తి' మంగళవారం వార్త ప్రచురించింది. స్పందించిన విగ్రహం చుట్టుపక్కల గహాల వారు బుధవారం ఉదయం బసవన్న విగ్రహానికి ప్రసాదు గోపి తదితరులు రంగులు పూయడం ప్రారంభించారు. దీంతో కనుమ పండుగ రోజు బసవన్న విగ్రహానికి నూతన రంగులు వేయడంతో కొత్త కాంతులను సంతరించుకుంది. అనంతరం గంగమ్మకు, బసవన్నకు ప్రత్యేక పూజలను నిర్వహించారు.



.గిత్త పొడవడంతో బయటకొచ్చిన పేగు

ఎద్దుల పండుగలో అపశ్రుతి

సోమల మండలం పొదలకుంటపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం సంక్రాంతి పండుగ వేడుకలో భాగంగా కనుమ పండుగ సందర్భంగా ఎద్దుల పండుగను నిర్వహించారు. వేడుకగా జరుగుతున్న ఎద్దుల పండుగను చూడటానికి ఇంటిలో నుంచి బయటకు వచ్చిన అబ్బు అనే వ్యక్తి పై ఎద్దు దూసుకువెళ్లి కడుపుపై కొమ్ముతో పొడవడంతో అతని పేగు బయటకు వచ్చింది. స్థానికులు 108కి సమాచారం అందించడంతో పైలెట్ కరిముల్లా, ఈఎంటి ప్రసన్న ప్రథమ చికిత్స అందించి పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

చిత్తూరు మెప్మా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో బుధవారం విష్ణు సకల వెంకటేష్ గుప్తా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిరాశ్రయులకు అన్నదానం చేసి తన మంచి మనసును చాటుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జోసఫ్ రాజు మాట్లాడుతూ విష్ణుభవన అధినేత వెంకటేష్ గుప్తా నిరాశ్రయుల పట్ల ఎంతో అభిమానం చూపించి సంక్రాంతి పండుగ రోజు నిరాశ్రయులకు అన్నదానం చేయటం అభినందనీయమని అన్నారు. అలాగే విష్ణు భవన్ అధినేత వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ నిరాశ్రయుల వసతిగహం నిర్వహిస్తున్న జోసఫ్ రాజును అభినందిస్తూ చాలా చక్కగా నిర్వహిస్తూ పరిశుభ్రంగా ఉందని, ఇంతమంది నిరాశ్రయులను ఆదుకోవడం అభినందనీయమని, తమ వంతు సహాయంగా నిరాశ్రయులకు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది అడ్వకేట్ స్వప్న, విష్ణు భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుగులతో భారీ పంట నష్టం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం

ఏనుగులతో భారీ పంట నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ అటవీ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వలన ఏనుగులు తరచూ పంట పొలాల్లోకి వచ్చి ఆరుగాలం కష్టపడిన పంట కోత సమయానికి నష్టం చేకూరుస్తున్నాయని, వాటిని నివారించేందుకు అటవీ శాఖ సిబ్బంది తగిన చర్యలు చేపట్టడం లేదన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని బోడబండ్ల వెలుతురిచేరి పంచాయతీలోని గ్రామాల్లోని వ్యవసాయ పొలాల్లోకి 15 ఏనుగుల గుంపు చేరుకుని పంటను మొత్తం ధ్వంసం చేశాయని, దీని వలన పంట కోసం వెచ్చించిన పెట్టుబడి రాకపోగా, నష్టాల ఊబిలో కూరుకు పోతున్నామని వాపోయారు. పంట పూర్తిగా నష్టపోతే ఏ 20 శాతమో తమకు నష్టపరిహారం అందించి చేతులు దులుపుకుంటున్నారని, దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామన్నారు. ఏనుగులను నివారించేందుకు కందకాలు, సోలార్ కంచె ఏర్పాటు చేసి తమ పంట పొలాలను కాపాడాలని, అడవిలో ఉండాల్సిన ఏనుగులు అక్కడే ఉండేలా వాటికి ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారుర. మంగళవారం రాత్రి బోడబండ్ల గ్రామంలోని కోదండ యాదవ కు సంబంధించిన పంటను ధ్వంసం చేసినట్టు రైతు వాపోయాడు.



ఏనుగుల గుంపు దాడితో నేలకూలిన కొబ్బరిచెట్లు

గంగయ్యకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురు కుప్పం మండలం మొండివెంగనపల్లె పంచాయతీ, బండమీద ఇండ్లు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు పోటుగారి గంగయ్య (45) మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీఎం థామస్ గంగయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. మృతుని కుమారుడు శ్రీధర్‌ను ఓదార్చి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

ఘనంగా మాజీ ఎంపీ జయంతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు మాజీ ఎంపీ నూతనకల్వ రామక్రిష్ణారెడ్డి జయంతి వేడుకలు పలమనేరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్దపంజాణి మండలంలోని కెలవాతిలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తమ కుటుంబీ కులతో కలిసి రామక్రిష్ణారెడ్డి స్మృతి వనంలో పూజలు నిర్వహించి నివాళులు అర్పించా రు. పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాలలో పెద్దపంజాణి, పట్టణ నాయకులు, ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగవరం: చిత్తూరు మాజీ ఎంపీ రామక్రిష్ణారెడ్డి 87వ జయంతి వేడుకలు మండల కేంద్రం, టిడిపి కార్యాలయంలో కీలపట్ల పంచాయతీలో మండల టిడిపి నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లక్నో రైలుకు కుప్పంలో స్టాపింగ్



రైలుకు పూజలు నిర్వహించి ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -కుప్పం టౌన్ : బెంగుళూరు-లక్నో రైలు ఇకపై కుప్పంలో ఆగనుంది. బెంగుళూరు నుండి లక్నో వెళుతున్న రైలును కుప్పం ప్రజల సౌకర్యార్థం కుప్పం పట్టణంలో ఆపడం పై పలువురు హర్షం వ్యక్తం చేశారు. రైలు ఆపడానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు కు, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ కు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారానికి ఒక్కరోజు మంగళవారం బెంగళూరు నుండి లక్నో వెళుతున్న రైలు కుప్పంలో ఆగనుంది. రైల్వే అధికారులు ఉత్తర్వులతో కుప్పంలో ఆగిన రైలుకు హేమ్ మాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు జగదీష్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించి రైలును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు కన్నన్, గోపీనాథ్, డాక్టర్ వెంకటేష్, రాజ్ కుమార్, సత్యేంద్ర శేఖర్, జాకీర్ అహ్మద్, వేలు, కౌన్సిలర్లు జిమ్ దామూ, సోము, బిజెపి శివశంకర్, వడివేలు, జనసేన నరేష్ పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన వైసిపి నేతలు



ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం పంచాయతీ, తూగుండ్రం గ్రామానికి చెందిన సర్పంచ్ శ్రీబాబు, సీనియర్ వైసీపీ బీసీ నేత చిట్టిబాబు మొదలి కలిసి మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం సదుంలో అయ్యప్ప స్వామిని దర్శించుకొని. అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిదున్ రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సన్మానించారు. అనంతరం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుత్తూరు కేశవరెడ్డి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి నాయకుడు ఆనంగంటి హరికృష్ణ సంక్రాంతి సందర్భంగా బుధవారం సదుం అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందించారు అనంతరం ఆలయం వెలుపల మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి మాటామంతి కలిపారు.

మాజీ జెడ్పిటిసికి నివాళులు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు:



గంగాధర నెల్లూరు మాజీ జడ్పిటిసి, టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షులు వెంకటేష్ గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న విప్, ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అక్కడికి చేరుకొని వెంకటేష్ భౌతిక కాయానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులతో టిడిపి ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు, టిడిపి జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, మండల పార్టీ అధ్యక్షుడు స్వామి దాస్, వైసిపి చిత్తూరు ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి, మాజీ సిడిసిఎంఎస్ ఛైర్మన్ బాబురెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, గంగాధర నెల్లూరు జనసేన ఇన్‌ఛార్జ్ యుగంధర్, మాజీ వైస్ ఎంపీపీ గుణారెడ్డి, టిడిపి నేతలు జీవరత్నం, జ్యోతి యాదవ్, పాచిగుంట రఘు, రాంబాబురెడ్డి, కోదండ రెడ్డి, నరసింహనాయుడు, కూటమి, వైసిపి చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో ఆరిమాని గంగమ్మ

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం : చిత్తురు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం గంగమ్మ గుడి గ్రామ ఆరిమాని గంగమ్మ గుడి వద్ద ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ మూడో రోజైన కనుమ పండుగ రోజు అమ్మవారికి విశేషాలంకరణతో ఉత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం అమ్మవారిని అతి సుందరంగా తీర్చిదిద్ది ఉదయం 5 గంటల నుంచి దర్శనం కలిపించారు. ఈ సందర్భంగా గంగమ్మ గుడి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో తిమ్మారెడ్డి, కార్వేటినగరం సిఐ హనుమంతప్ప, ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్ ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు.

లక్ష్మీదేవి ఆలయానికి విరాళం



ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఆవులపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వెండి తో చేసిన లక్ష్మీదేవి అమ్మవారిని పెద్ద ఉప్పరపల్లి కి చెందిన కూరపాటి వెంకట రామ గోపాల్, సరస్వతమ్మ, వెంకట రెడ్డి ప్రసాద్,రజని కుటుంబ సభ్యులు విరాళంగా అందజేశారు. అమ్మవారి వెండి విగ్రహం దాదాపు 33 వేల 816 రూపాయలు విలువ చేస్తుందని వారు తెలిపారు. ఆలయంలోని మూల విరాట్ వక్షస్థలంపై ఉన్న లక్ష్మీదేవి అమ్మవారి కి వెండి లక్ష్మీదేవి అమ్మవారి విగ్రహాన్ని అలంకరించనున్నట్లు తెలిపారు. ఆలయ అర్చకులు గోపి స్వామికి అమ్మవారి వెండి విగ్రహాన్ని అందించారు.

బోరు నీటిలో ఇసుక

- తాగునీటికి ఇబ్బంది
- ట్యాంకర్లతో నీరు పంపిణీ
- ప్రజాశక్తి వార్తకు స్పందన



ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ అడుసు పల్లె గ్రామంలో తాగునీటిని సరఫరా చేసే పంచాయతీ బోరు బావి నుండి నీటితో పాటు ఇసుక వస్తుండడంతో ప్రజలు నీటిని తాగలేక వడకట్టి వాడుకుంటున్నారన్న వార్తను మంగళవారం 'ప్రజాశక్తి' వెబ్ న్యూస్ లో ప్రచురితమైంది. స్పందించిన అడుసుపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం(మణి), రమేష్ బాబు, తదితరులు బుధవారం కనుమ పండుగ సందర్భంగా ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకూడదని ఉదయం నుండి 6 ట్యాంకర్ల నీటిని గ్రామంలోని 300 కుటుంబాలకు పంపిణీ చేశారు. కార్యాలయాలకు సెలవు రావడంతో గురువారం బోరు బావి నుండి పైపులను తీసి నూతన పైపులను బిగించి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించిన నాయకులకు ప్రజలు అభినందనలు తెలిపారు.

క్రికెట్ పోటీ విజేతలకు బహుమతులు పంపిణీ



క్రికెట్ కప్ అందిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం2025 సంక్రాంతి సందర్భంగా నంజంపేట పాఠశాల లో జరిగిన పూర్వ విద్యార్థుల క్రికెట్ టోర్నమెంట్ లో విన్నర్ గా నంజంపేట ఆర్ఆర్ఆర్ టీమ్, రన్నరప్ గా, కమ్మపల్లె సూపర్ కింగ్స్ గెలుపొందాయి. మొదటి బహుమతి 30వేలు రూపాయలు ఎన్ వి ఆర్ ట్రస్ట్ ద్వారా, రన్నరప్ కి 20 వేలు రూపాయలు క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహక కమిటీ ద్వారా అందజేశామని నిర్వాహకులు కైలాసం మురళి,హరీష్,ప్రవీణ్, శీను, రవి,అబ్బు, అస్లాం, బాల, అష్రాఫ్, ఇమ్రాన్,నాగభూషణం,దేవ, అన్వర్‌బేగ్,లోకేష్ తెలిపారు.

అంబేద్కర్ క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-పెద్దపంజాణి: జై భీమ్ యూత్ ఫౌండేషన్ వారు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చే అంబేద్కర్ క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జై భీమ్ యూత్ ఫౌండేషన్ చైర్మన్ బి.శంకర్ మాట్లాడుతూ పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తన స్వగ్రామం యర్రాతివారిపల్లిలో కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపామని, తాము ముద్రించిన భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ముఖచిత్రంతో ఉన్న నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ యూత్ ఫౌండేషన్ చైర్మన్ తో పాటు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అటకెక్కిన అరణియార్ అభివృద్ధి

- ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..
- నిధులు రూ.35.64 కోట్లు మంజూరు
- కాంట్రాక్టరు నిర్వాకం
- అర్ధాంతరంగా ఆగిన పనులు



కట్టపై అసంపూర్తిగా మిగిలిన పిట్టగోడల నిర్మాణం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: అరణియార్ ప్రాజెక్టు అభివృద్ధికి మంజూరైన కేటాయించిన జైక నిధులు 35.64 కోట్లు నిరుపయోగంగా మారాయి. కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో అరణియార్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

తిరుపతి జిల్లాలోని పిచ్చాటూరు మండలం చిన్న తరహా ప్రాజెక్టుల్లో ఒకటి.. ప్రాజెక్టులకు తలమానికంగా నిలుస్తున్న అరణియార్ నీటి నిలువ 1.82 టిఎంసిల సామర్థ్యం వుంది. 1958లో నిర్మించిన ఈ ప్రాజెక్టు రైతులకు నేటి వరకూ మూడు పంటలు అందిస్తూ ఆదుకుంటోంది. ప్రత్యక్షంగా ఐదువేల ఎకరాలకు నీరు అందిస్తూ, పరోక్షంగా ఐదు వేల ఎకరాలకు అరణియార్ నీరు అందిస్తోంది. పిచ్చాటూరు, నాగలాపురం మండలానికి చెందిన రైతులకు గొప్ప వరంగా నిలిచింది. అలాంటి ప్రాజెక్టు డిసెంబరులో కురిసిన వర్షానికి ప్రాజెక్టులోకి పూర్తిగా నీరు చేరి నిండుకుండలా కనువిందు చేస్తోంది. ఈ ప్రాజెక్టు 450 మంది మత్స్య కార్మికుల కుటుంబాలకు జీవనం కల్పిస్తోంది.

అభివృద్ధికి నిధులు మంజూరు

ఇలాంటి అరణియార్ ప్రాజెక్టు అభివృద్ధి పనులకు జైక నిధులు 2017-2018 సంవత్సరంలో రూ.35.64 కోట్లు మంజూరు అయ్యాయి. అయితే కాంట్రాక్టరు నిర్లక్ష్యం కారణంగా నేటికీ 20 శాతం పనులు అసంపూర్తిగా వున్నాయి.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

కాంట్రాక్టర్ పుణ్యమా అని ప్రాజెక్ట్ పై పిట్ట గోడలు ఇరువైపులా పూర్తి చేయాల్సింది వుంది. 20 శాతం పనులు కూడా చేయకుండా అసంపూర్ణంగా నిలిచిపోయింది. ఇరిగేషన్ కార్యాలయం కొత్తగా ప్రారంభించి స్లాబ్ వేశారు. కానీ గోడలు నిర్మించి పూర్తి చేయకుండా అవి అసంపూర్తిగానే మిగిలాయి. డిసెంబరులో కురిసిన వర్షానికి ప్రాజెక్టుపై రోడ్డు మరమ్మతులు చేయకపోవడం వల్ల బురద మారి రాకపోకలకు ఇబ్బంది కలిగించింది. ప్రాజెక్టు లోపల భాగంలో పెద్ద ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి.. చెట్లను తొలగించని కారణంగా ప్రాజెక్టు లోపల ముళ్ల చెట్లు ప్రమాదకరంగా మారాయి. ప్రపంచ బ్యాంకు 2017-18 సంవత్సరంలో జైక నిధులు 35.64 కోట్లు మంజూరు చేయగా ఇంతవరకు 6.5 కోట్ల మేర పనులు మాత్రమే చేసి 6.14 కోట్లు నిధులు కూడా పొందారు. అయినా కాంట్రాక్టరు ఇంత వరకూ పనులు ప్రారంభించలేదు. అధికారులు మాత్రం వారిపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధికి తోడ్పాటు అందించలేక పోతున్నారు. ఈ ప్రాజెక్టు అభివృద్ధిలో జైక నిధులు ఒక గొప్ప వరమని రైతులు భావిస్తున్నారు. అలాంటి వరం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి ఆటంకంగా మారింది. ఇష్టానుసారంగా వ్యవహరించుటం వల్ల ప్రాజెక్టు అభివృద్ధికి కుంటుపడిందని ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్ట్ రద్దుపరిచి మరొకరికి అవకాశం కల్పించి అభివృద్ధికి తోడ్పడాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలి. జైక నిధులు మంజూరై ఆరు సంవత్సరాలు పూర్తి అవుతున్నా ఇంతవరకు 20 శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. కాంట్రాక్టరుపై కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు స్పందించి జైక నిధులు టెండర్ తీసుకున్న వ్యక్తితో త్వరగా పనులు చేయించాలి.. లేకుంటే అతని టెండరును రద్దు చేసి మరొకరికి అప్పగించి త్వరగా జైక నిధులను ప్రాజెక్టుకు వినియోగించి అభివృద్ధికి దోహదపడాలి..


- డి రవి, ఆయకట్టు ఛైర్మన్, పిచ్చాటూరు మండలం.

20 శాతం పురోగతి..

పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు పనులు 20 శాతం జరిగాయి. జైక నిధుల పనులు శ్రీకాళహస్తి డివిజన్ కార్యాలయం అధికారులు చేయాల్సి వుంది. వారిని సంప్రదించి త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తాం..

- రామచంద్రమూర్తి, ఇరిగేషన్ డిఈ, పిచ్చాటూరు మండలం.

అభివృద్ధి పనులకు మహర్దశ: ఎమ్మెల్యే



పాత్రికేయులతో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి: అభివృద్ధి పనులకు మహర్దశ లభించిందని, ఎన్నికల సమయంలో చెప్పిన పనులన్నింటినీ ఇప్పుడు చేసి చూపిస్తున్నామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పెద్ద పంజాణి మండలంలోని తమ స్వగ్రామం కెలవాతిలో సంక్రాంతి సందర్భంగా మీడియాతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ ఆరు నెలల కాలంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పై వివరించారు. నియోజకవర్గంలో ఇప్పటిదాకా రూ. 13 కోట్ల సిసి రోడ్లు, 10 కోట్లతో లింక్ రోడ్లు, ఈఏపి ద్వారా 132 కోట్లతో 117 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇక రూ. 29.09 కోట్లతో కౌండిన్య పరివాహక ప్రాంతంలో చెక్ డ్యామ్స్, 6.92 కోట్లతో ఎస్సీ కమ్యూనిటీ హాల్స్....రూ. 1.90 కోట్లతో జగ్జీవన్‌రామ్ భవనం, గంగన్న శిరస్సు స్టేజ్ -1 క్లియరెన్స్‌కు రూ. 9.32 కోట్లు, గంగన్న శిరస్సు స్టేజ్ -2 క్లియరెన్స్ కు రూ.27 కోట్లు, లోవొల్టేజ్ సమస్య పరిష్కారానికి రూ.45 కోట్లతో సబ్ స్టేషన్ల ఏర్పాటు చేస్తామని తెలిపారు. పాలి టెక్నిక్ కాలేజ్ బిల్డింగ్ కోసం రూ. 11 కోట్లు, 33 ఎకరాల్లో మోడల్ అగ్రికల్చర్ మార్కెట్ ఏర్పాటు, కుంకీ ఏనుగుల ప్రాజెక్ట్, రూ. 5.80 కోట్లతో టౌన్ హాల్ ఏర్పాటు, 22 కోట్లతో ఎస్‌టిపి ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీసీ బాలికల రెసిడెన్సియల్ రూ. 17 కోట్లు, మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ కాలేజ్ రూ. 15 కోట్లు, వి కోటలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు, రూ. 22.65 కోట్లతో కైగల్ ప్రాజెక్ట్, రూ.9 కోట్లతో కోల్డ్ స్టోరేజి, సిప్ (క్రిటికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రోగ్రామ్) ద్వారా రూ.110 కోట్లతో పట్టణంలో పూర్తి స్థాయిలో రోడ్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వివరించారు. అంచలంచెలుగా పలమనేరు నియోజకవర్గ అభివృద్ధిని చేపట్టి గతంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం

ఐదుగురు నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి -వికోట : మన్యం జిల్లా నుండి చిత్తూరు జిల్లా వి కోటకు గంజాయి తరలిస్తున్న ముఠాను వి కోట పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పలమనేరు డిఎస్పి ప్రభాకర్ కథనం మేరకు.. వికోట మండలానికి చెందిన పరంధామ లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ తరచు మన్నెం జిల్లా నుండి వి కోటకు గంజాయి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వారు తెలిపారు. పరంధామ స్థానికంగా ఐదుగురితో కలిసి గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నామన్నారు. వీరి వద్ద నుండి సుమారు ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వి కోట మండలానికి చెందిన పరంధామ, ఆందోని, దావూద్, చిరంజీవి, శివల పై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు వారు తెలిపారు. ఈ ముఠాకు సంబంధించి మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు త్వరలో వారిని కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి నిషేధిత వస్తువుల అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు . వీరిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇద్దరు కానిస్టేబుళ్లకు డిఎస్పి ప్రభాకర్ నగదు బహుమతి అందించారు. ఈ దాడులలో సిఐ సోమశేఖర్ రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మామపై అల్లుడు కత్తితో దాడి

- పరిస్థితి విషమం - రుయాస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ దిడ్డివారిపల్లి దాసరి వీధిలో ఉంటున్న వెంకటరమణ (47) పై అల్లుడు సుబ్రహ్మణ్యం కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. సుబ్రహ్మణ్యం తన భార్యతో గొడవ పడుతూ ఉండగా వెంకటరమణ అడ్డు చెప్పడంతో ఇంటిలోకి వెళ్లి కొడవలి తీసుకువచ్చి విచక్షణారహితంగా తలపై నడుము పై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన గ్రామస్తులు సోమల ప్రభుత్వ వైద్యశాలకు ఆ తర్వాత పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం, మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించినట్టు సమాచారం. సంఘటనపై పోలీసులకు సమాచారం రావడం తో పూర్తి వివరాల సేకరణలో ఉన్నారు.


కళలను ప్రోత్సహించాలి: మాజీ ఎంపీపీ



బహుమతులు అందిస్తున్న మాజీ ఎంపీపీ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: రంగవల్లుల కళలను ప్రోత్సహించాలని మాజీ ఎంపీపీ సుచిత్ర జయప్రకాష్ నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని టేకు మంద పంచాయతీలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఎంతో ఇష్టమైందని, ముగ్గులను వాటిల్లో రకరకాల ముగ్గులను రకరకాల కలర్లతో అమర్చడం వల్ల ముగ్గు అందం పెరుగుతుందని పోటీ తత్వంలో అందరూ పోటీ పడతారని అందులో బాగా గుర్తింపు పొందిన ముగ్గులకు బహుమతులు అందిస్తామన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఏగ్గిడి భాస్కర్, శివ , పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ మంత్రి లోకేష్

ప్రజాశక్తి -యాదమరి: ఉపాధి హామీ పథకం ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ డైరీ ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. మంగళవారం తిరుపతి జిల్లా నారావారిపల్లి లో చిత్తూరు జిల్లా అధ్యక్షులు గుణశేఖర్, ఎం బాల , ఏపీవో, ఉపాధి హామీ పథకం సేవా సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం 2025 సంవత్సరం ఉపాధి హామీ పథకం ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ డైరీని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు.

సీఎంకు సత్కారం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు కు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి తో కలిసి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి స్వగ్రామమైన నారావారి పల్లెలో సంక్రాంతి పండుగను ముగించుకొని తిరుగు ప్రయాణంలో భాగంగా సీఎం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అప్పటికే విమానాశ్రయంలో వేచి ఉన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి, మాజీ మార్కెటింగ్ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి , వర్ధ రాజు జయచంద్ర నాయుడు ముఖ్యమంత్రికి శాలువా కప్పి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.



సీఎంకు వీడ్కోలు పలుకుతున్న మాజీ మంత్రి చెంగారెడ్డి

బిఆర్ దొరస్వామి నాయుడుకి ఘన నివాళులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిఆర్ దొరస్వామి నాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. పట్టణంలోని బస్టాండు కూడలిలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో బిఆర్‌డి సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు నాయకులు బిఆర్‌డి అభిమానులు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. రెస్కో సంస్థ ఆవిర్భవించిందని ఆయన కృషి వల్లే అని తెలిపారు. కుప్పం నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు సైతం విద్యుత్ తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆ రోజుల్లోనే అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన నాయకుడిగా బిఆర్‌డి చరిత్రలో నిలిచిపోతారని, కుప్పంలో విద్యుత్ దీపాలు వెలుగుతున్నంత కాలం ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందంటూ ఆయన సేవలను కొనియాడారు. కుప్పం నియో జకవర్గ మాజీ శాస న సభ్యుల విగ్రహాలను నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయా లని ఆయన అభిమానులు కోరారు. టిడిపి రాష్ట్ర కార్య నిర్వా హక కార్యదర్శి మాట్లాడుతూ బిఆర్ దొరస్వామి నాయుడు విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులలో రోగులకు రగ్గులు, రొట్టెలు, బిస్కెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ సురేష్ బాబు

కుప్పం రూరల్ : కుప్పం పట్టణం కొత్తపేట కురుబయపురంలో మాజీ వార్డు సభ్యులు, దళిత నాయకులు కుప్పస్వామి బి.ఆర్ దొరస్వామి నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ మాట్లాడుతూ బి.ఆర్.డి కుప్పం శాసనసభ్యులుగా సేవలందించిన సందర్భంలో తన తండ్రి కుప్పస్వామి కొత్తపేట కూర్మాయిపురం వార్డు సభ్యుడిగా, బి.ఆర్.డి అనుచరుడిగా కొనసాగారని తెలిపారు. బిఆర్‌డి కుప్పం నియోజకవర్గం అభివృద్ధికి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన అనుచరుడిగా ఆయనపై అభిమానంతో పాలాభిషేకం నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు అనుచర గణంతో కలిసి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో ఏర్పాటుచేసిన బి.ఆర్.డి సంతాప సభకు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.



బిఆర్ దొరస్వామి నాయుడికి నివాళులర్పిస్తున్న నాయకులు

'సుభాష్ పాలేకర్స్ ప్రకృతి వ్యవసాయం' సదస్సుకు రండి..

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ప్రకృతి వ్యవసాయ సదస్సుకు రావాలని ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రకృతి వ్యవసాయ జాతీయ ఉద్యమ నాయకుడు పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ముఖ్య అతిథిగా పాల్గొనే ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు, రైతులకు అవగాహన కల్పించేందుకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యం లో ఈ నెల 25, 28 తేదీల్లో నిర్వహించనున్న సదస్సుకు రావాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి కార్యక్రమ నిర్వాహకుడు, ఎస్వీయు ఎన్ఎస్ఎస్, మీడియా కోఆర్డినేటర్ డాక్టరు పాకనాటి హరికృష్ణ బుధవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాకనాటి హరికృష్ణ మాట్లాడుతూ ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రావాలని వారు ఆహ్వానించారు. భారతదేశంలో ప్రకృతి వ్యవసాయం మూలకర్త పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ద్వారా జనవరి 25 న వెయ్యి మంది విద్యార్థులకు, 28న వెయ్యిమంది రైతులకు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 'ప్రకృతి వ్యవసాయం'పై అవగాహన, సాధికారితనూ కల్పించేందుకు కార్యశాల, సదస్సును నిర్వహిం చాలని ఎస్వీయు ఇన్‌ఛార్జీ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు నిర్ణయించారని కార్యక్రమ నిర్వాహకుడు హరికృష్ణ ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థుల సదస్సుకు విశ్వ విద్యాలయం ద్వారా కాలేజీ యాజమాన్యాలకూ ఆహ్వానం పంపుతామన్నారు. రైతు సదస్సుకు తిరుపతి జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రాం కన్వీనర్ కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మాజీ ఛైర్మన్ రామకృష్ణ పాల్గొన్నారు.